RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం , సెప్టెంబర్ 8 , 2026

# బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి



**చుంచుపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** రాష్ట్ర సచివాలయం వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలను మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ ఆదేశాల మేరకు అధికారులు ఇంత దారుణంగా వ్యవహరించడం గతంలో ఎన్నడూ చూడలేదని ఆమె విమర్శించారు. ఈ ఘటన రాష్ట్ర చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి, ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఆ హామీలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇటీవల మహిళా మంత్రిని పదవి నుంచి తొలగించడం, ఆదివాసీ యువతి శిరీష మృతి ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు, తాజాగా మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన అవమానకర ఘటనలను చూస్తుంటే రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని శాంతి అన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ హోం శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అధికార పార్టీ ఒత్తిడితో అతిగా వ్యవహరిస్తే భవిష్యత్తులో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారుల వ్యవహారశైలిని పార్టీ అధినేత కేసీఆర్ గుర్తుంచుకుంటారని బాదావత్ శాంతి పేర్కొన్నారు.

# కనీస వేతన సలహా బోర్డు నుంచి సీఐటీయూను మినహాయించడం దుర్మార్గం

## - సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్




**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** కేంద్ర కనీస వేతన సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి ప్రధాన కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ అన్నారు. మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు ఇది నిదర్శనమని విమర్శించారు. కనీస వేతనాలు, కార్మికుల జీవన ప్రమాణాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే బోర్డులో అన్ని ప్రధాన కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు గౌరవప్రదమైన కనీస వేతనాలు నిర్ణయించాలని కోరారు.
కార్మిక హక్కులను హరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కొత్తగూడెం పరిధిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక పని ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రమోద్, అల్లి నాగయ్య, శివ, కట్ట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పంప్ డ్రైవర్ మృతి

## ప్రగాఢ సానుభూతి తెలిపిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** విధులకు వెళ్తున్న సమయంలో రుద్రంపూర్ ఫిల్టర్ బెడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం సివిల్ ఫిల్టర్ బెడ్ పంప్ డ్రైవర్ ఎస్. కోటేశ్వర్‌రావు మృతి చెందారు. ఆదివారం రాత్రి తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న ఐఎన్‌టీయూసీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకుని, పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ మాట్లాడుతూ కోటేశ్వర్‌రావు మృతి సింగరేణి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి కంపెనీ నుంచి అందాల్సిన హక్కులు, ప్రయోజనాలు అందేలా యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్మికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు మల్లికార్జున, భాను కమల్, జల్లి కిరణ్, విజయ్, పరంజ్యోతి, మల్లారపు కొమరయ్య, సకినాల సమయ్య, రంగినేని వెంకటేశ్వర్లు, ఫిట్టర్ విజయ్, నాగేందర, పాటల్, చారీ,విజయ్ రాజు, వెంకటస్వామి, ఈశ్వర్ తదితర నాయకులు, పంప్ డ్రైవర్లు, వాల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# హామీలను వెంటనే అమలు చేయాలి



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్‌కు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలన్నింటినీ నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూక్యా సోనా, సర్పంచ్ బట్టు కనకరాజు, కళ్ళుగడ్డ సురేష్, రామకోటి, వినోద్, శివ, బద్రు, సపావత్ రాము, రాజవరపు మురళి, లావుడ్య వెంకటేష్, మాజీ సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ బట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా ధర్నా

## ప్రజలచే ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడమేమిటని ప్రశ్న





**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం కొత్తగూడెంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించే హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై ఇలాంటి చర్యలకు ప్రభుత్వం స్వస్తి పలకాలని, ప్రతిపక్ష నాయకులకు ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# సింగరేణి ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలి

## - సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో స్ట్రక్చర్ సమావేశం



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** సింగరేణి కార్పొరేట్ ఏరియా పరిధిలోని వివిధ విభాగాల సమస్యలపై సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం (పర్సనల్, ఐఆర్ అండ్ పీఎం) జి.వి. కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఐఎన్‌టీయూసీ నాయకులతో నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డెంటల్ డాక్టర్, చీఫ్ రేడియాలజిస్ట్, చీఫ్ ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని యూనియన్ నాయకులు కోరారు. అలాగే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంఆర్ఐ, సీటీ స్కాన్, లాపరోస్కోపీ, కొలొనోస్కోపీ పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగూడెం రీజియన్‌లోని టెక్నీషియన్లు, జనరల్ మజ్దూర్‌లకు ప్రథమ చికిత్స శిక్షణ ఇవ్వాలని, ప్రధాన ఆస్పత్రి మురుగునీటి వ్యవస్థకు మరమ్మతులు చేపట్టాలని, వైద్యులు, సిబ్బంది కోసం సబ్సిడీ క్యాంటీన్‌ను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా క్వార్టర్లు, పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రతిపాదించారు. ఈ అంశాలపై సమగ్రంగా సమీక్షించిన జీఎం జి.వి. కిరణ్‌కుమార్ సంస్థ పరిధిలో సాధ్యమైన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జీఎం కె.అజయ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరరావు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# శిరీష హంతకులను కఠినంగా శిక్షించాలి




## - కేసును నీరుగారిస్తే రాజధాని ముట్టడిస్తాం : సాబీర్ పాషా





**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** నర్సు ఊకె శిరీష హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే రాజధాని ముట్టడిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా హెచ్చరించారు. సోమవారం కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సాబీర్ పాషా మాట్లాడుతూ గిరిజన యువతి శిరీష హత్యపై ప్రభుత్వం కంటితుడుపు చర్యలతో సరిపెట్టకుండా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు త్వరగా శిక్ష పడేలా చూడాలన్నారు. సీపీఎం నాయకుడు కె.బ్రహ్మాచారి మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మంద హనుమంతు బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామిక శక్తులు అండగా ఉంటాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఫోన్ ద్వారా మాట్లాడుతూ శిరీష హత్య ఘటనను అసెంబ్లీలో ప్రస్తావించి, బాధిత కుటుంబానికి పరిహారం, ఉద్యోగం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు గౌని నాగేశ్వరరావు, ఉక్కా, సామాజిక ప్రజా సంఘాల నాయకులు సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మి కుమారి, ఎస్ కే ఫహీం, చంద్ర అరుణ, ఏం జ్యోతి, వాసం రామకృష్ణ, మద్దెల శివకుమార్, వర్క అజిత్, హరికృష్ణ, రాంబాబు, రమేష్, అసిఫ్ ఉద్దీన్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, బిక్షం, నాగకృష్ణ, తదితరులు మాట్లాడారు. సలిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజకీయపక్షాలు, సంఘాల నాయకులు ఖయ్యూం, లక్ష్మీ, షాహిన్, కైసర్, విష్ణు, సాయి కుమార్, యాకుబ్ షావలి, జాటోత్ కృష్ణ, కల్లూరి కిషోర్, రవి ముసలం రామకృష్ణ, గోవిందు, అంకుష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయం విషయంలో వామపక్షాల వైఖరిపై విమర్శలు

## - అభివృద్ధి పేరుతో రైతుల ప్రయోజనాలను విస్మరించొద్దు : జలగం యువసేన



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయం, భూ సర్వేల అంశంలో వామపక్ష పార్టీల వైఖరిపై రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయని జలగం యువసేన జిల్లా నాయకుడు యాకూబ్ అలీ పేర్కొన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ అంశంపై స్పందించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రకారం పేద రైతులు, కర్షకులు, శ్రామికుల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడటం, వారి జీవనోపాధికి నష్టం కలిగించే చర్యలను వ్యతిరేకించడం వామపక్షాల బాధ్యత అని అన్నారు. గతంలో భూసేకరణ, నిర్వాసితుల సమస్యలపై పోరాడిన పార్టీలు ఇప్పుడు అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయని తెలిపారు. అయితే విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో రవాణా, పారిశ్రామిక, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందనే వాదనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి అవసరాల దృష్ట్యా వామపక్షాలు కొన్ని ప్రాజెక్టులకు షరతులతో మద్దతు ఇవ్వడం లేదా మౌనం వహించడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు తీసుకుంటే రైతులకు సరైన నష్టపరిహారం, పునరావాసం కల్పించాల్సిందేనని యాకూబ్ అలీ అన్నారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే అది వామపక్షాల మూల సిద్ధాంతాలకు విరుద్ధమనే విమర్శలకు బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజలు, రైతుల నుంచి వస్తున్న ప్రశ్నలకు ఆయా పార్టీల స్థానిక నాయకత్వాలు ఎలా స్పందిస్తాయో చూడాల్సి ఉందన్నారు.

# బిఆర్ఎస్ నేతలు అరెస్ట్ అక్రమం కార్పొరేటర్ సాగర్ మల్హోత్రా



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)** బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటానికి నిరసిస్తూ సోమవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కొత్తగూడెం 29వ డివిజన్ కార్పొరేటర్ సాగర్ మల్హోత్రా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభాపక్ష ఉప నేత హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తు ఇలాంటి చర్యలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వసనీయత కోల్పోతుందన్నారు.

# హాజీ రంజాన్ ఖాన్‌కు ఘన సన్మానం

## - హజ్ ఆత్మను శుద్ధి చేసే పవిత్ర ఆధ్యాత్మిక ప్రక్షాళన : సాబీర్ పాషా



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)** ఇటీవల హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త హాజీ మహమ్మద్ రంజాన్ ఖాన్‌ను కొత్తగూడెం ఉర్దూఘర్ షాదీఖానాలో ఘనంగా సన్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డా. నయీమ్ ఖురేషి ముఖ్య అతిథులుగా పాల్గొని హాజీ రంజాన్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. హజ్ అనేది కేవలం ఒక ప్రయాణం కాదని, ఆత్మను శుద్ధి చేసే పవిత్ర మార్గమని, గొప్ప ఆధ్యాత్మిక ప్రక్షాళన అని అన్నారు. అనంతరం ముస్లిం మైనారిటీ నాయకులు, మత పెద్దలు, మసీదు ఇమామ్‌లు హాజీ రంజాన్ ఖాన్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మక్కా నుంచి తీసుకొచ్చిన కానుకలను అతిథులకు అందజేశారు. కార్యక్రమంలో జాఫర్ ఖురేషి, మక్బూల్ ఖురేషి, అబిద్ హుస్సేన్, ఎండీ సిరాజుద్దీన్, షమీమ్మద్దీన్, యూసుఫ్, నజీర్ ఖాన్, అమృద్దీన్ ఖిర్వాల, జమాల్, బాబుజానీ ఖాన్, అదం ఖాన్‌తో పాటు పలువురు ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్ హౌస్ అరెస్ట్



**చుంచుపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):** అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్‌ను పోలీసులు సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, అవినీతి పాలనకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన నేపథ్యంలో చుంచుపల్లి ఎస్సై రవికుమార్ ఆయనను ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

# జీఓ 97ను రద్దు చేయాలి

## - రాహుల్ గాంధీకి ఏఐఎస్ఎఫ్ పోస్ట్‌కార్డుల ద్వారా వినతి



**చుంచుపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రుద్రంపూర్ పాలిటెక్నిక్ విద్యార్థులు సోమవారం రాహుల్ గాంధీకి పోస్ట్‌కార్డుల ద్వారా వినతి తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల విజయ్ మాట్లాడుతూ జీఓ 97తో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్య కార్పొరేటీకరణకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు జీఓను రద్దు చేసి, డిప్లొమా విద్యార్థుల ఉద్యోగ అర్హతలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, పాలిటెక్నిక్ కమిటీ సభ్యులు సలిగంటి జయదీప్, యశ్వంత్, ప్రియాన్షి, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేసేదాకా వదలం

**- ప్రజావాణిలో కలెక్టర్‌కు వందలాది దరఖాస్తులు అందజేసిన బీఆర్ఎస్ శ్రేణులు**





**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి వందలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచనల మేరకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ల ప్రజలు క్యూలైన్లలో బారులు తీరి తమ సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు. హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కార్పొరేటర్లు సాగర్, బీమా శ్రీధర్, ముత్యాల ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో సమగ్ర ప్రగతి

**- స్థలాల పరిశీలన వేగవంతం శుభపరిణామం : సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**





**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ మల్టీ డిసిప్లినరీ బృందం సోమవారం జిల్లాకు చేరుకుని సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో ప్రతిపాదిత స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం శుభపరిణామమన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో మారుమూల ఏజెన్సీ, పారిశ్రామిక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రెవెన్యూ, సర్వే అధికారులు భూ వివరాలు, నివేదికలను ఏఏఐ బృందానికి పూర్తిస్థాయిలో అందించి, అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు బోయిన విజయ్‌కుమార్, దుర్గయ్య, దాసరి శ్రీనివాస్, నాయకులు ఎండీ యూసుఫ్, గడ్డం సతీష్‌కుమార్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు

**ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి**



**తల్లాడ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఖండించారు. దళిత నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. దళిత, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను పునరావృతం చేయవద్దని తాతా మధును హెచ్చరించారు. పదవులు శాశ్వతం కాదని, రాజ్యాంగ విలువలు, ప్రజల గౌరవమే ముఖ్యమన్నారు. దళిత సమాజానికి తాతా మధు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు కొనసాగితే ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# హక్కుల సాధనకై ఉప్పెన లా చలో హైదరాబాద్

**ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఉద్యోగ, ఉపాధ్యాయ లోకం కదనభేరి**

**అశ్వారావుపేటలో టీజీ జేఏసీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ**

**10న ఎల్బీ స్టేడియం గర్జించేలా తరలిరావాలని పిలుపు**

**6 డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దుపై తేల్చకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక**



**అశ్వారావుపేట సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఉద్యోగుల న్యాయమైన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ తీరు పై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల లోకం పోరుబాటకు సిద్ధమైంది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ 10వ తేదీన భాగ్యనగరంలో తలపెట్టినచలో హైదరాబాద్ (ఉద్యోగుల హక్కుల సాధన మహాధర్నా) కార్యక్ర మానికి సం బంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం అశ్వారా వుపేట మం డల కేంద్రంలో టీజీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరిం చారు . ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ప్రభుత్వ తాత్సార ధోరణిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**హామీల అమలులో మొండిచేయి.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం**

పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మండల జేఏసీ చైర్మన్ కే. మాధవరెడ్డి, కో–చైర్మన్ నాగేశ్వరరావు మరియు ఇతర సంఘాల నాయకులు మాట్లాడుతూ పాలకు లు మారినా ఉద్యోగుల తలరాతలు మారడం లేదని తీవ్ర ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వాని కి వెన్నుదన్నుగా ఉంటూ పాల నను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యో గులు, ఉపాధ్యాయుల సమ స్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణ మన్నారు.కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులకు రావాల్సిన కరు వు భత్యం ను సైతం సకాలంలో ఇవ్వకుండా దాటవేయడం ప్ర భుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి సమస్యలను పరిష్కరించకపోతే, ఉద్యో గులఆగ్రహజ్వాలల్లో ప్రభుత్వం భస్మం కాక తప్పదని హెచ్చరిం చారు.

**టీజీ జేఏసీ ప్రధాన డిమాండ్లు ఇవే**

2023 జూలై 1వ తేదీ నుంచి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన మెరుగైన ఫిట్‌మెంట్‌తో రెండవ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు దీర్ఘకాలంగా బకాయిపడ్డ 6 డీఏలను వెంటనే విడుదల చేయా లని, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన మెడికల్, జీపీ ఎఫ్ తదితర పెండింగ్ బిల్లులను నెలకు కనీసం రూ. 2,000 కోట్ల చొప్పున చెల్లించి క్లియర్ చేయాలని, ఉద్యోగుల జీవితా లకు భద్రత లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పా త పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని, న్యూ ఎం ప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహి త చికిత్స అందేలా పూర్తిస్థాయిలో, సమర్థవంతంగా అమలు చేయాలని,ఎన్నికల మేనిఫెస్టో లో ప్రభుత్వం ఇచ్చిన అన్ని ర కాల హామీలను ఎటువంటి కొ ర్రీలు లేకుండా పరిష్కరించాలని వారుప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సెప్టెంబర్ 10న ఎల్బీ స్టేడియం వేదికగా కదనభేరి**

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఎల్.బి. స్టేడియంలో సెప్టెంబర్ 10వ తేదీ (గురువారం) సా యంత్రం 3:00 గంటలకు జరగనున్న ఉద్యోగుల హక్కుల సాధన సభ చారిత్రక మైలురాయిగా నిలవబోతోందని నా యకులు స్పష్టం చేశారు. మండల పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, గెజిటెడ్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు/పెన్షనర్లు పార్టీలకు, సంఘాలకు అతీతంగా భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి తమ ఐక్యతను చాటిచెప్పి డిమాండ్లను సాధించుకోవాలని ఉద్ఘాటించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీజీ జేఏసీ మండల చైర్మన్ కే. మాధ వరెడ్డి, కో–చైర్మన్ నాగేశ్వరరావులతో పాటు జేఏసీ నాయకు లు ఎస్.కె. ఫకీర్, జి. రాజేంద్ర కుమార్, సత్యనారాయణ, ఎం. కుమారి, కొర్రి శ్రీనివాసరావు, జయ నాగరాజు, జి. దుర్గయ్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు బి.నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

**రుక్మాతండలో దారుణ ఘటన.. తీవ్రంగా గాయపడిన మహిళ**



**టేకులపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కుటుంబ కలహాలు భౌతిక దాడికి దారితీశాయి. భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త కత్తితో దాడి చేయడంతో భార్య తీవ్రంగా గాయపడిన ఘటన టేకులపల్లి మండలం రుక్మాతండలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రుక్మాతండకు చెందిన ధరావత్ దస్లి (40)పై ఆమె భర్త కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె ఎడమ చేతి మణికట్టుకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ అశోక్, పైలట్ వెంకట రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులతో భగ్గుమన్న అశ్వారావుపేట

**కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలన పై బీఆర్ఎస్ కదనభేరి**

**పట్టణంలో దద్దరిల్లిన బైక్ ర్యాలీ ప్రధాన రహదారిపై బైఠాయింపు**

**ప్రజాపాలన లో 420 హామీల అమలు కోరుతూ 200కు పైగా దరఖాస్తులు**



**అశ్వారావుపేట సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**
అసెంబ్లీ సమావేశాల వేళ బీఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తో పాటు మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా ల క్ష్మారెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులను అక్రమంగా అరె స్టు చేయడాన్ని నిరసిస్తూ అశ్వారావుపేట నియోజకవర్గం లో బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ఎండగడుతూ గులాబీ దళం చేపట్టిన ఆందోళనలతో పట్ట ణం దద్దరిల్లింది. అధినేత కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున రోడ్ల పైకి వచ్చారు.

**హోరెత్తిన బైక్ ర్యాలీ' స్తంభించిన ట్రాఫిక్**

ముందుగా పట్టణంలో బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నినాదాలతో హోరెత్తిస్తూ ఎంపీడీవో కార్యా లయానికి ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఎంపీడీవో కా ర్యాలయం ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తుతూ బైఠాయించడం తో కాసేపు రాకపోకలు స్తంభిం చాయి.

**ప్రజాపాలన'లో వినూత్న నిరసన**

మండల పరిషత్ కార్యాలయం లో జరుగుతున్న ప్రజావాణి /ప్రజాపాలన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు వినూత్న రీతిలో నిరసన తెలిపాయి. కాంగ్రెస్ ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, కార్యకర్తలు క్యూ లైన్ల లో నిలబడి అధికారులకు 200కు పైగా వినతిపత్రాలు సమర్పించారు.

మహిళా ప్రజాప్రతినిధులపై దాడి గర్హనీయం: బీఆర్ఎస్ నేతలు
ఈ సందర్భంగా పార్టీ నాయకు రాళ్లు కాసాని నాగ శేషా పద్మ, వగ్గెల పూజ, కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చేందుకు 100 రోజు ల్లో నెరవేరుస్తామని ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజ లను దగా చేశారని, తీరా 1000 రోజులు గడిచినా ఒక్క హామీనీ అమలు చేయలేకపో యారని మండిపడ్డారుప్ర జాసమస్యలపై నిలదీస్తున్న ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు మహిళా ప్రజాప్రతినిధులపై దౌర్జన్యానికి దిగడం ప్రజాస్వా మ్యానికే గొడ్డలిపెట్టని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మె ల్యేల చీరలు లాగడం, మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని పురుష పోలీసులతో ఈడ్చుకెళ్ల డం దారుణమన్నారు. తెలంగా ణ సంస్కృతికి భంగం కలిగిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని దె బ్బతీస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని స్పష్టం చేశా రు.భారీగా తరలివచ్చిన శ్రేణులుఈ నిరసన కార్యక్రమంలో నాయకులు జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, గుడవర్తి వెంకటేశ్వర రావు, సత్యవరపు సంపూర్ణ, ఇస్లావత్ లక్ష్మి, మోటూరి మో హన్, ఎస్.కె. రఫీ, శెట్టిపల్లి రఘురాం, రాజనాల గంగాధర్, అఖిల్, కిరణ్, రమేష్, పాలవలస జీవన్, నల్లపు రామారా వు, కూనసోత్ నవీన్, బొల్లు కొండ చెన్నారావు, పానుగంటి లక్ష్మణ్ రావు, జుజ్జూరి సత్యనారాయణ, సున్నం రామలక్ష్మ య్య, యుగంధర్, బుల్లెట్ రాజు, ప్రతాప్, వల్లెపు తిరుపతి రావు, లాజర్, కిశోర్, రాంబాబు, అమీర్, కూరపాటి నరేష్, నారం నాగ లక్ష్మి, జుజ్జూరి సాయి, పానుగంటి చెన్నకేశవులు, కవులూరి నరేష్, కాటూరి నాగు, తగరం జగన్నాథంలతో పాటు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, యువజన, విద్యార్థి, మహిళా విభాగాల నేతలు, భారీ సంఖ్య లో కార్యకర్తలు పాల్గొన్నారు.



# కనీస వేతన సలహా మండలిలో కార్మిక సంఘాలకు స్థానం కల్పించాలి

**సీఐటీయూ మండల కమిటీ డిమాండ్**



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కనీస వేతన సలహా మండలిలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అశ్వారావుపేట హమాలీ అడ్డ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల శ్రమకు తగిన కనీస వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడుతున్న సంఘాలకు సలహా మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండి ఏసు, పోకల నాగేంద్ర, రాంబాబు, షేక్ కాసిం, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**చెట్లు తొలగించిన ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటాలని డిమాండ్**




**తల్లాడ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**
మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాల ఏర్పాటు పేరుతో పెద్ద చెట్లను అనుమతులు లేకుండా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పల్లె ప్రగతి, పల్లె ప్రకృతి వనాల కింద పెంచిన చెట్లను సంరక్షించాలని కోరారు. విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లను నిబంధనల ప్రకారం కొమ్మలు మాత్రమే తొలగించాలని, చెట్లను పూర్తిగా నరికివేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చెట్లు తొలగించిన ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో శ్రీనివాస్, పాత్రికేయులు ప్రసాద్, కావేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం , సెప్టెంబర్ 8 , 2026

## తాతా మధు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలి : జూపల్లి రమేష్

**- దళిత స్పీకర్‌ను అవమానించడం రాజ్యాంగాన్ని అవమానించడమే**



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి)**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానించేలా ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ తీవ్రంగా ఖండించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనన్నారు. తాతా మధు వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి సభా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేసి బహిరంగంగా క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షకు సిద్ధమని రమేష్ హెచ్చరించారు. ఇది వ్యక్తిగత రాజకీయ పోరాటం కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేపట్టే పోరాటమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, కౌన్సిలర్లు మిండా హరిబాబు, నార్లపాటి దివాకర్, అల్లాడి రామారావు, కాంగ్రెస్ నాయకులు బండి చెన్నారెడ్డి, నారాయణపురం ఉపసర్పంచ్ ఆకుల శ్రీను, ఆసుపాక యూత్ నాయకులు షేక్ కరీం, వీరనాల నాగులు, నారాయణపురం గ్రామశాఖ అధ్యక్షుడు సీహెచ్ నాగేంద్ర, పరిటాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలి

**ప్రజావాణిలో బాలభారతి విద్యార్థుల వినతి**



**తల్లాడ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాలభారతి విద్యాలయం ప్రాంతంలో వీధి కుక్కలు, కోతులు గుంపులుగా సంచరిస్తుండటంతో విద్యార్థులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని సోమవారం ప్రజావాణిలో వినతి సమర్పించారు. రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు, కోతుల కారణంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుని విద్యార్థులు, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాలభారతి విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలలో అవినీతిపై విచారణ జరిపించాలి

**ప్రజావాణిలో బీఆర్ఎస్ మండల నాయకుల వినతి**



**శంకరపట్నం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

మండలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అవినీతి చోటుచేసుకుంటోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జడ్పీటీసీలు ప్రొద్దుటూరు సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారుల కోసం 'భవిత' కేంద్రం

**ఉచిత విద్య, శిక్షణ, రవాణా సౌకర్యాలు : సీడీపీవో అలేఖ్య పటేల్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**

దివ్యాంగ చిన్నారుల సమగ్ర వికాసం కోసం రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'భవిత' కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సీడీపీవో అలేఖ్య పటేల్ తెలిపారు. 3 నుంచి 15 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం కేంద్రంలో ఆట వస్తువులు, ప్రత్యేక పరికరాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. స్పెషల్ బీఈడీ అర్హత కలిగిన ఇద్దరు శిక్షకులను నియమించామని, ఉచిత మధ్యాహ్న భోజనంతో పాటు గోదావరిఖని నుంచి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి కేంద్రం దోహదపడుతుందని, అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో కోరారు.




## తల్లాడలో సమైక్య భవనాలకు సర్పంచ్ శంకుస్థాపన

**రూ.60 లక్షలతో ఆరు భవనాల నిర్మాణం**





**తల్లాడ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలో సమైక్య భవనాల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళా సంఘాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఇందులో తల్లాడలో నాలుగు, నారాయణపురంలో రెండు భవనాలు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు సమైక్య భవనాలు ఉపయోగపడతాయని అన్నారు. నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఎంపీడీవో అంబటి శ్రీధర్‌రాజు, ఏపీఎం రవికుమార్, ఏపీవో కోటయ్య, పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్తీక్, ఈవో శ్రీహరికృష్ణ, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందుకు సీతారామ ప్రాజెక్టు నీరు అందించాలి

- **బోడు కేంద్రంగా రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలి.**
- **కరెంటు కోతలు, లో-వోల్టేజ్ సమస్యలు పరిష్కరించాలి**



**టేకులపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

ఇల్లందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని అందించాలని, బోడు కేంద్రంగా రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం టేకులపల్లి తహసీల్దార్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతమైన ఇల్లందు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ఈ ప్రాంతానికి అందించి శాశ్వత సాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న మాట్లాడుతూ.. బోడు కేంద్రంగా రెవెన్యూ మండలం ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కరెంటు కోతలు, లో-వోల్టేజీ కారణంగా బోర్లు, బావుల నుంచి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంతులు, వీరభద్రాచారి, సుడిగాలి వెంకన్న, సుందర్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు న్యాయం చేయాలి



**- రోస్టర్ పాయింట్లు పెంచాలని పల్లెపల్లెకు మాలల చైతన్య యాత్ర : టీఈఏఎం**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

ఎస్సీ వర్గీకరణలో మాలలకు న్యాయం చేయాలని, రోస్టర్ పాయింట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పల్లెపల్లెకు మాలల చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ ఫర్ మాల (టీఈఏఎం) రాష్ట్ర గౌరవ సలహాదారులు సలాకుల శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, శనగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్ తెలిపారు. చుంచుపల్లిలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో శాస్త్రీయత, హేతుబద్ధత లోపించిందని, రోస్టర్ పాయింట్లలోనూ మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై మాలలను చైతన్యపరిచి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

తొలుత రెండు ఉమ్మడి జిల్లాల్లోని 43 మండలాల్లో చైతన్య యాత్ర నిర్వహించి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సమావేశంలో నిర్ణయించారు. మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు సమర్పించడంతో పాటు యాత్ర కార్యాచరణ, షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మాలలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సమావేశానికి దాసరి రమేష్ అధ్యక్షత వహించగా టీఈఏఎం నాయకులు బూర్గుల కరుణాకర్, శెట్టి కమలాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, తలారి కిషోర్‌బాబు, డి.సుధాకర్, తమ్మల్ల జోష్, మద్దాల మహేష్, ఉల్లోజు వెంకటరమణ, ఉల్లోజు ప్రియదర్శిని, సూరం వరప్రసాద్, శనగల లక్ష్మణ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలతో వాగు నీరు కలుషితం



- **పశువులకు అనారోగ్యం**
- **దుర్వాసనతో పొలాల్లోకి కూలీలు రావడం లేదని రైతుల ఆవేదన**

**శంకరపట్నం, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

కేశవపట్నం జాతీయ రహదారి వంతెనపై నుంచి చికెన్, కూరగాయల వ్యర్థాలు, హోటళ్లు, దుకాణాల చెత్తను వాగులో పడేస్తుండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని సమీప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటిని గేదెలు, ఎద్లు, మేకలు తదితర పశువులు తాగి అనారోగ్యం పాలవుతున్నాయని తెలిపారు. వాగు నీటితో వ్యవసాయం చేస్తున్న పొలాలపై కూడా ప్రభావం పడుతోందని, దుర్వాసన కారణంగా పొలాల్లో పనులకు కూలీలు రావడం లేదని రైతులు పేర్కొన్నారు. సమీపంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ వ్యాపారులు అక్కడ వ్యర్థాలను వేయకుండా వాగులో పడేస్తున్నారని, దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ వాగు నీరు ముత్తారం చెరువు మీదుగా గద్దపాక, కలవాల ప్రాజెక్టులకు చేరుతుందని, ఆయా ప్రాంతాల్లో తాగునీటి వనరులు కూడా ఉన్నందున ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాల తరలింపును అరికట్టి, వాగును శుభ్రపరిచి పశువులు, రైతులను రక్షించాలని కోరారు.

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా**

కేశవపట్నం వ్యాపారులు చికెన్ వ్యర్థాలను మక్త గ్రామానికి వెళ్లే మార్గంలో వేయడంతో వీధి కుక్కలు గుంపులుగా చేరి ప్రయాణికులు, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయని మక్త గ్రామ సర్పంచ్ గత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

## దళితుల జోలికి వస్తే ఖబడ్దార్

**ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన అన్నారుగూడెం కాంగ్రెస్ నాయకులు**

**తల్లాడ, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను అన్నారుగూడెం కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. దళిత నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, మాజీ వీడీసీ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, తాళ్ల జోసెఫ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ అన్నారు. దళితులు, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను పునరావృతం చేయవద్దని వారు సూచించారు. పదవులు శాశ్వతం కావని, ప్రజల గౌరవం, రాజ్యాంగ విలువలే శాశ్వతమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై మాట్లాడాలని హితవు పలికారు.

తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను సహించబోమని, అవసరమైతే సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు.

## సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు శంకరాచారి మృతి



**టేకులపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ టేకులపల్లి గ్రామశాఖ సభ్యుడు అనంతుల శంకరాచారి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు, గుగులోత్ రామచంద్, నాయకులు అనంతోజు చంద్రాచారి, భూక్య నర్సింగ్ అన్నారు. సోమవారం శంకరాచారి పార్థివదేహాన్ని పార్టీ, రైతు కూలీ సంఘం నాయకులు సందర్శించి న్యూ డెమోక్రసీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీ విస్తరణ కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ నిర్బంధాలు, జైలు జీవితాన్ని ఎదుర్కొన్నారని తెలిపారు. శంకరాచారి కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నాగేశ్వరరావు, సుడిగాలి వెంకన్న, బానోత్ వెంకట్రాం, ధరావత్ వెంకన్న, ఆంగోత్ బాలు, సర్వన్, రాయిండ్ల కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

## బల్మూరులో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు




**అచ్చంపేట, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు సిద్ధమైన బీజేపీ, యువమోర్చా నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. బల్మూరు మండల కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఆర్.ఓఎఫ్ఆర్ పట్టాల రద్దుపై పునర్విచారణ చేయాలి



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి):**

ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీ పరిధిలో చాతకొండ అటవీ రేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటవీ భూముల సర్వే అనంతరం వంద మందికి పైగా గిరిజన రైతుల ఆర్.ఓఎఫ్ఆర్ పట్టాలు రద్దు చేసినట్లు వస్తున్న సమాచారంపై సమగ్ర విచారణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని పెద్దతండా సర్పంచ్ పూర్ణచందర్‌లాల్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రైతులకు ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పట్టాలు రద్దు చేసి ఉంటే, తమ వాదనలు, అభ్యంతరాలు తెలిపే అవకాశం లేకుండా పోతుందని పేర్కొన్నారు. ప్రతి రైతుకు ఆర్.ఓఎఫ్ఆర్ పట్టా రద్దుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. పట్టాలపై స్పష్టత లేకపోవడంతో ఎరువులు, విత్తనాలు, ఇతర ప్రభుత్వ వ్యవసాయ ప్రయోజనాలు పొందడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాతకొండ రేంజ్‌లో నిర్వహించిన సర్వే వివరాలు, ఆర్.ఓఎఫ్ఆర్ పట్టాల రద్దుకు గల కారణాలు, సంబంధిత ఎస్‌డీఎల్‌సీ నిర్ణయాలు, రైతులకు నోటీసులు జారీ చేశారా లేదా అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అర్హులైన గిరిజన రైతుల ఆర్.ఓఎఫ్ఆర్ హక్కులను పరిరక్షించి, వారి జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పూర్ణచందర్‌లాల్ విజ్ఞప్తి చేశారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం , సెప్టెంబర్ 8 , 2026

# దళిత విద్యార్థులపై ఎందుకీ వివక్ష

- ముందుగానే స్కాలర్షిప్ డబ్బులు కట్టించుకుని
- పది మాసాలైనా స్కాలర్షిప్ డబ్బులు విద్యార్థులకు తిరిగి ఇవ్వని వైనం
- ఇతర వర్గాలకు ఓ లెక్క దళిత విద్యార్థులకు మరో లెక్క అని ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాలు



హైదరాబాద్ సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్ రమేష్)

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో, పీజీ ప్రవేశాలలో గత పది మాసాల క్రితం నూతన విద్య సంవత్సరాన్ని పురస్కరించుకొని, ఫ్రీ అడ్మిషన్స్ పేరిట ఆన్లైన్లో వచ్చిన మెసేజ్లు చూసుకొని, పలు వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు జిల్లాల నుండి, ఉస్మానియా కళాశాలకు చేరుకున్నారు. అక్కడికి వెళ్ళాక ఇతర వర్గాల విద్యార్థులకు స్కాలర్షిప్ యూనివర్సిటీ అకౌంట్లోకి వస్తుందని, తెలియజేశారు అక్కడి అధికారులు. కానీ దళిత విద్యార్థులకు మాత్రం, మీకు స్కాలర్షిప్ 20వేల రూపాయలు వస్తుంది కాబట్టి అట్టి డబ్బులు ఇప్పుడే చెల్లించాలని చెప్పడంతో, యూనివర్సిటీకి వెళ్లిన దళిత విద్యార్థిని విద్యార్థులు అవక్కయ్యారు. ఫ్రీ సీట్ అని చెప్పారు కదా సార్ మాకు, అని అడగగా అది మాకు తెలియదని పై వారికి అన్ని తెలుసునని 20,000 రూపాయలు కట్టనిదే అడ్మిషన్ ఇవ్వమని తేల్చి చెప్పారు. విద్యార్థుల నుండి, హాస్టల్ వసతి కొరకు 8000 రూపాయలు సైతం వసూలు చేయడం జరిగింది. దిక్కుతోచని స్థితిలో తమ పేరెంట్స్ కి బంధువులకు ఫోన్లు చేసి ఫోన్ పేల ద్వారా డబ్బులు తెప్పించుకొని అప్పటికప్పుడు దళిత విద్యార్థిని విద్యార్థులు పిజి అడ్మిషన్ కోసం డబ్బులు కట్టడం జరిగింది. మరి కొంతమంది డబ్బు కట్టలేని స్థితిలో కళాశాలను వదిలి తిరిగి వారి వారి గ్రామాలకు జిల్లాలకు వెళ్లిపోయారు. విద్యార్థులు అడ్మిషన్ సమయంలో చెల్లించిన 20,000 రూపాయలు 10 మాసాలు అవుతున్న వారి అకౌంట్లో పడకపోవడంతో దళిత విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడు తున్నారు. కొన్ని వర్గాలకు ఒక లెక్క మా దళిత వర్గాలకు మరో లెక్క అంటూ నిలదీసేందుకై సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఒకేసారి 20వేల రూపాయలు కట్టించుకున్న యూనివర్సిటీ అధికారులు, విడతల వారిగా కాకుండా, తాము కట్టిన విధంగానే 20000 రూపాయల స్కాలర్షిప్లు సైతం ఒకేసారి విద్యార్థినీ విద్యార్థుల ఖాతాల్లో జమ చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళిత ఎమ్మెల్యేలు దళిత మంత్రులు ఉన్నప్పటికీ, వారి వలన దళిత జాతికి కానీ దళిత విద్యార్థిని విద్యార్థులకు కానీ, ఒరిగిందేమీ లేదని విద్యార్థి సంఘాల నాయకులు దుయ్యబట్టారు. వెంటనే దళిత విద్యార్థుల నుంచి ముందస్తుగా తీసుకున్న స్కాలర్షిప్ డబ్బులు విడుదల చేయాలని అధికారుల ముందుకు వారి డిమాండ్ ను, తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ దళిత విద్యార్థినీ విద్యార్థులకు ఈ విషయంలో ఏ మాత్రం అన్యాయం జరిగిన రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడి చేస్తామంటూ దళిత విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి దళిత విద్యార్థులు చదువుకోవాలని ఉద్దేశం లేదని, తాతలు, తండ్రులు లాగే వేట్టి చాకిరికి, బానిసత్వానికి, బందీలుగా బ్రతకాలని కుట్రలో భాగమే, రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా, దళిత విద్యార్థిని విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తుందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. దళిత వ్యతిరేకులని అపవాదు ప్రభుత్వం మూటగట్టుకుంటుందని, అందుకే దళిత విద్యార్థిని విద్యార్థుల పట్ల ఈ అనుచితమైన ప్రయోగాలని ప్రయోగిస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.